# ౨. కొత్త రోడ్లు

ఏ ఆలోచన్లలో ఆ తెల్లవారు జామున కొండబాబు కూరుకుపోయాడో, నూకరాజుకి తెలీదు.

ఆ రోజున కొండబాబు, కోడికంటే చాలా ముందే లేచాడు. అసలా రాత్రి, కొండబాబుకి కోడి కునుకే పట్టింది. బాధల భయాల వాళ్లకే కాకుండా, ఆ రాత్రి అతడికి కూడా నిద్ర రాలేదు వెలిసిపోతున్న వెన్నెట్లో, ఇంటిముందు పడక కుర్చీలో కూర్చున్నాడు.

చల్లని గాలిలో కూర్చున్నా, ఆ చల్లగాలి అతడికి చల్లగాలేదు.

వెలిసిపోతున్న వెన్నెల, శుభోదయం చెప్తున్నా, అతడి నిద్ర లేని కళ్లు చూళ్లేదు. మామిడి గున్న మీద, మధురంగా కూస్తున్న కోకిల మధుర గానాన్ని, అతడి చెవులు విన్లేదు.

అతడు పూర్తిగా ఆలోచన్లలో మునిగిపోయాడు.

అతడు వొళ్లు తెలీకుండా, ఆలోచిస్తున్నాడు.

కోడికూతవిని, నూకరాజు చేతికర్ర పట్టుకుని పొలంలోకి బయల్దేరాడు. కొండబాబు ఇంటి ముందు నుంచి వెళ్తూ, కొండబాబుని చూసాడు. చూసిన తర్వాత, చూస్తూ పిల్చాడు. కొండబాబు వినలేదు. నూకరాజు మూడుసార్లు పిల్చాడు. కొండబాబు వినలేదు. నాల్గోసారి అరుస్తూ పిల్చాడు. అప్పుడు మొహమెత్తి చూసాడు. అప్పుడు నూకరాజుని పిల్చి కూర్చోమన్నాడు. ఎర్రటి సూర్యుడు, ఉగ్రంగా లేస్తున్నాడు. అంచాత కొండబాబుకి కోపం వచ్చింది. వెంటనే కుర్చీని పశ్చిమ దిక్కుకి తిప్పి కూర్చున్నాడు.

'తవర్ని సాలా సార్లు పిలిసాను. తవరు ఆలకించనేదు. అంటే తవరు ఏదో గెట్టిగా ఆలోసిస్తున్నారన్నమాట! ఏటిబాబూ, కత?!' అని నూకరాజు కత చెప్పమన్నాడు.

కొండబాబు కతలు చెప్పడు! అంచాత ........ అవునోయ్! అవునవును! నేను ఆలోచిస్తున్నాను! కొందరి ఆలోచన్లు కొందరికి నష్టం తెస్తాయ్! అందుకే నేను ఆలోచిస్తున్నాను! ......' అని మనసులో అనుకున్నాడేగానీ, నూకరాజుకి చెప్పలేదు.'తవరు ఏటంతలా ఆలోసిస్తన్నారు! ఏటికత!' అని నూకరాజు, ఏదో పెద్దకత వున్నాదని, అనుకుని చకితలబడ్డాడు.

కొండబాబు జేబులోంచి చుట్టతీసి ముట్టించాడు. ఓ చుట్ట నూకరాజుకి అందించాడు.

'నా గురించి నేను ఆలోచించుకోనవసరంలేదు. ఆ విషయం నీకు తెలుసు. నా పొలాలు బాగా పండుతున్నాయ్. నా వ్యాపారాలు అడ్డులేకుండా లాభాలతో నడుస్తున్నాయ్. నేను ఆర్యోగంగా, ఆనందంగా, భగవంతుడి దయవల్ల, బతుకుతున్నాను. నా భార్య ఆరోగ్యంగా, ఆనందంగా, తిరుగుతోంది. కొడుకులూ-కోడళ్లూ, కూతుళ్లూ-అల్లుళ్లూ, మనవలూ-మనవరాళ్లూ అందరూ ఆనందంగా వైభవంగా బతుకుతున్నారు. అదంతా దేవుడి చలవ! అంచాత నేను నాగురించి ఆలోచించుకోనవుసరంలేదు!' అని కొండబాబు కత చెప్పకుండా,చల్ల చల్లగా చెప్పాడు

'తవరు మారాజు లాంటోరు! తవరు మారాజులాగే బతుకుతున్నారు! తవరు సంపాదించగల్రు! నల్గురికి ఎట్టగల్రు! అందుకే తవరి మాట పెద్ద పెద్దోరందరికి ఏదం....' అని '...... అయితే, ఇంతకీ ఏటిబాబూ, కత?!' అని నూకరాజు, కత చెప్పమని, చుట్టనోట్లో పెట్టుగున్నాడు.

ఆ మాటలు విన్న కొండబాబు, చిరునవ్వు నవ్వాడు.

' నాను వొర్రీ అవుతోంది నా గురించి కాదని నీకు తెల్సిపోనాది! నానిప్పుడు వొర్రీ అవుతోంది మీ గురించేననీ, మనూరి గురించేననీ-నాను సెప్పకుండానే నీకు తెల్సిపోనాది! మనూళ్లో మనం పెద్ద దేవాలయం కట్టించాం. రోడ్లు ఏయించాం. ఇస్కూలు ఎట్టించుగున్నాం. పెద్ద వూళ్లల్లో గూడా ఇస్కూలునేదు. మంది సిన్న వూరే అయినా, ఇస్కూలు వుంది. మనూళ్లో కరెంటు అన్నూళ్ల కంటే ముందే ఎలిగిపోనాది. అయినా - మనూర్ని ఇంకా ముందుకు తీసుకు వెళ్లాలి. అందుకే నాను కునుకు మానేసి, ఆలోసిస్తున్నాను!' అని కొండబాబు ఎందుకు ఆలోచిస్తున్నాడో చెప్పాడు.

'..... మనూరు - మనోళ్లూ-ఇయ్యాల ఇలా పచ్చగున్నారంటే, అది తవరి సలవే అనీ నిన్నగాక మొన్న పుట్టిన బిడ్డకి కూడా ఎరికే! నానింక సెప్పటానికేటుంది! .....' అని నూకరాజు రెండు చేతులు పైకెత్తి దండం పెట్టాడు. అలా దండం పెట్టి, 'అసలు ఏటి బాబూ కత!.....' అని అసలు కత చెప్పమని మళ్లీ అడిగాడు. కొండబాబు కత చెప్పలేదు!

అప్పుడు నూకరాజు దండం పెట్టకుండా, కొండబాబు మొహంలోకి తిన్నగా చూసాడు.

'.... బాబూ-ఈ పెపంచకం ఎలాగుంది?! ఈ పెపంచకంలో పెతివోడూ - ముగ్గురంటే ముగ్గురి కోసవే బతుకుతుండు! ఆళ్లోల్లు? తనూ-పెళ్లాం-పిల్లలూ! అలాగే పెతివోడూ నాల్గంటే నాల్గింటి కోసవే బతుకుతున్నాడు! అయ్యేటి? తిండీ-బట్టా-ఆస్తి-సుఖం! ఈటి కోసం మడిసికి డబ్బు కావాలి! అందుకోసం - మడిసి ఏ దురుమారగవైనా సేసేస్తుండు! ఇయిగాక మడిసి మరెందు కోసవైనా బతుకుతుండా?! అయితే – తవర్నాగ అక్కడక్కడ పెజల కోసం బతికేవోళ్లు – నచ్చెత్రాల్లాగున్నారు. అందుకే - అలగా జనానికి ఈ వాత్రవైనా కూడూ-గుడ్డా వున్నాయ్! ....' అని కొండబాబు నక్షత్రం లాంటివాడని చెప్పి, '..... తవరు సెప్పటంనేదు! ఏదో కత వుంది! ఏటాకత బాబూ! ....' అని కత చెప్పమని, నూకరాజు మళ్లీ అడిగాడు.

కొండబాబు తలపైకెత్తాడు. చిరునవ్వు నవ్వుతూ నూకరాజు కళ్లల్లోకి చూసాడు.

'.... ఇయ్యాల ఇయ్యన్నీ మనూరికి ఒచ్చినాయంటే - ఇందులో నీ సాయం సాలా వుంది! నానే పని సేసినా నీతో సెప్పకుండా సేయనేదు! సేయను గూడా! నువు మనూరికి పెద్దవు! పెద్దోడివి! అందుకే నువు సై అనకుండా, నాను సీవనుగూడా సంపను! ఇప్పుడు మనూళ్లో కాలేజీ ఎట్టించుకోవాలి! దానికోసవే ఆలోసిస్తన్నాను! సెడిపోయేవోడు సెత్త ఆలోచన్లు సేస్తాడుగానీ, మనవలా ఆలోసించం! అయితే-కాలేజీ ఎట్టించేముందు-మనం మనూరికి మరోటి సేయాలి! మనూరు ఇరుగ్గుంది. తీరూ-తెన్నూ నేకుండా వుంది. వూళ్లో రోడ్లు నేవు.అంచాత -

వూళ్లో కొత్త రోడ్లు ఏయించుగుందాం! ఆటి కోసం నాను సేయవాల్సింది సేస్తూనేవున్నాను. ఇప్పుడు నువు సెయ వాల్సింది నాను నిదానంగా సెప్తాను!' అని చెప్పి, ఏమి చెప్పకుండా వుండిపోయాడు.

' తవరు నోరిప్పితే, కొండ మీంచి నీరు కిందికి పారుతున్నట్లుంటాది! ఇయ్యాల నీరు నేల మీంచి కొండ మీదికి ఎల్లబోతున్నట్లున్నాది! తవరు కత సెప్పకుండా - నాను కాలు కదపను! మరో సుట్ట ముక్క ఇచ్చుకోండి!' అని నూకరాజు, కత వినకుండా కదల్ననిచెప్పాడు. ' నువు సై అనకుండా నాను సీవను గూడా సంపనని నీకు తెలుసు! అంచాత నువు 'ఊ' అంటే నాను ఉరక లేయించి, కొత్త రోడ్లు ఏయిస్తాను' అని కొండబాబు కొంత చెప్పాడు.

' నాను సై అని ఎప్పుడో అన్నాను! 'ఊ' అని ఇప్పుడన్నాను! మరింకే టయినా, అనాలా?! సెప్పు! ....' నూకరాజు చుట్ట పొగవొదుల్తూ, చుట్టంలా చెప్పాడు.

'...... మనం ఎంతగా, ఎంత మంచిపని చేద్దావన్నా. కుసింతో-కసింతో సెడ్డ జరుగుద్ది! ఏ సీవగాడికో, కుసింత కష్టం కలుగుద్దని మనం మనూరందరికీ పని కొచ్చే మంచి పని మానుకోనేం!....' అని చల్లని నీరులా కొండబాబు, కత చెప్పాడు.

' ......తవరు రోడ్లు ఏయించడం మనూరి కోసవేగానీ, తవరికోసరం కాదు! మంచి పని మానీ మని ఒవుడంటాడు! అది నాను జూసుగుంటా! ఒక కొత్త సుట్ట ఇచ్చుకోండి.' అని నూకరాజు, నీరులా గాకుండా, నిప్పులా చెప్పాడు.

కొండబాబుకి కొండంత డబ్బు వుందని అందరూ అంటారు. ఆ వూరికే గాకుండా, అలాంటి చాలా వూళ్లకి ఆధిపత్యం, అధికారం కలవాడని అందరికీ తెలుసు. కొండబాబు తాత వందలకే అధికారనీ, అతడి తండ్రి వేల నుంచి లక్షలకి పెరిగాడనీ, అతడు మాత్రం లక్షల నుంచి కోట్లకు పెరిగాడని, అందరూ ఏకగ్రీవంగా అంటారు.

ఏవీ లేని వూరి పెద్ద నూకరాజుకి ఇవాళ కొంత ఆస్తి వుందంటే, అది కొండబాబు దయవల్లే అనీ చాలా మంది అంటారు.

ఆ వూళ్ళో రోడ్లు వేయించడం, దేవాలయాలు కట్టించడం, స్కూళ్లు పెట్టించడం, కరంటు తెప్పించడం – ఇలాటివి ఎవరు చేసారని అడిగితే – కొండబాబుగాక ఎవరు చేయగలరని తిరిగి అడుగుతారు.

అలాంటి కొండబాబుని - ఆ తెల్లవారు జామున - ఆ వెన్నెల్లో - ఆ చల్లనిగాలిలో -నిద్ర లేకండా ఆలోచన్లలో ముంచినవాడు గోవిందం అని కొండబాబు, నూకరాజుకి చెప్పలేదు.

గోవిందం ఆ వూళ్లో ఒక చిన్న పూరింట్లో వుంటున్నాడు. ఆ ఇల్లే అతడి తండ్రి అతడికి మిగిల్చిన ఆస్తి. తండ్రి చనిపోయాక, యస్సెస్సెల్సీ పూర్తి చేసి, చదువు మానేసాడు. అతడు ఆ తర్వాతర చిన్న టీ కొట్టు పెట్టాడు.

ఆ టీ కొట్టు దగ్గర జనం చాలా మంది చేరేవారు. ఆ కొట్టు ముందు బెంచీల మీద

జనం ఎప్పుడూ సభ చేస్తున్నట్లు కూర్చుండేవారు. కుఱ్ఱకారుకి అది కూడలి స్థలం అయిపోయింది. ఎప్పుడూ అక్కడ సందడిగా, సరదాగా వుంటూ వుండేది.

కొండబాబు ఎవుడు? ఆడెటువంటివాడు? ఆడేటిసేసాడు? ఆడి మంచితనం ఎటువంటివి? ఇయ్యన్నీ తనికీసేస్తే కొండబాబు ఎవుడో తెలిసి పోద్ది!

కొండబాబు ఎట్టిన స్కూల్లో ఓళ్లు సదువుతున్నారు? ఆడు ఏయించిన రోడ్ల మీద ఒవుడి లారీలు తిరుగుతున్నయ్? ఆడు ఏయించిన దీపాలు ఒవుడింట్లో ఎలుగుతున్నయ్? ఆడు కట్టించిన గుళ్లో దేవుడు ఎవుడి పచ్చం పలుకుతున్నాడు? ఆడు సేసిన పెజాసేవ ఏ పెజల్ని ఎదిగించింది? ఇయ్యన్నీ తనికీసేస్తే - కొండబాబు ఎవుడో తెలిసిపోద్ది!

కొండబాబు, కోటీసెరుడెలాగయ్యాడో తనికీసేస్తే, కొండబాబు ఎవుడో తెలిసిపోద్ది!

అలా అలా - తెలిసీ తెలీని వయసులో గోవిందం, కుఱ్ఱకారు కూతలు కూస్తూ వుండేవాడు!

కుటుంబాల మధ్య వున్న కలతల వల్ల, అలా కారుకూతలు కూస్తున్నాడని కొందరనేవారు! కొందరలా అనేవారుకాదు!

' కొండబాబు ఏం జేసినా, ఒవుడి కంటికీ కనబడకుండా చేయగల్డు! ఒవుడి కంటికేనా కనబడితే, ఆ సూసినోడు ఎవుడికీ సెప్పకుండా సేయగల్డు! ఒవుడేనా సెప్పేసినా, ఆ ఇన్నోడు నోరిప్పకుండా సేయగల్డు! ఒవుడేనా నోరిప్పితే, ఆడి నోట్లో రాయి ఇసిరీగల్డు!

అలా గోవిందం అంటూ, కొండబాబుని, కొండమీంచి కిందికి విసిరేసేవాడు!

అలా అంటున్న గోవిందాన్ని, నూకరాజు మందలించేవాడు.

'కొండబాబు సేస్తున్న పెజాసేవలో - ఎంటుకుముక్కంత ఈడు సేయనేడు! అయితే- కూతలు కూయడం నేర్చుగున్నాడు! ....' అని నూకరాజు, గోవిందాన్ని తిడుతూ వుండేవాడు. నూకరాజే గాకుండా, ఎంతో మంది అలా తిడుతూ వుండేవారు. అయితే - కొందరు గోవిందం చెప్పింది నిజవే అని అంటూవుండేవాళ్లు.

గోవిందం గురించీ – అలాంటి కొందరు కుఱ్ఱకారు గురించీ - కొండబాబుకి, అనేక మంది అనేక రకాలుగా చెప్తూ వుండేవారు. కొండబాబు అందరి మాటల్నీ - అన్ని రకాల మాటల్నీ వింటూ వుండేవాడు. అలావిని '......, మతం మందు లాంటిదని కొందరంటారు! అది నేను నమ్మను, అయితే - సమసమాజమంత మత్తయిన మందు మరోటి లేదని నేను నమ్ముతాను! అంతేగాకుండా, కుఱ్ఱ వెధవలు, వెఱ్ఱి వెధవలయి చెడిపోతున్నారని విచారిస్తు న్నాను!..' అని కొండబాబు అంటూ వుండేవాడు.

* * *

ఆ వూళ్లో ఆరు రోడ్లు వేయడానికి ఆర్డర్లు వచ్చాయని కొండబాబు, నూకరాజుకి చెప్పాడు. మరికొన్నాళ్లకి కాలేజీ కూడా వచ్చేస్తుందని చెప్పాడు.

ఆరోజు సాయంకాలం వూళ్లో చాలా మంది కొండబాబు ఇంటి ముందు చేరారు.

రోడ్లు వేయడానికి ఆర్డర్లు తెచ్చినందుకు కొండబాబుకి దండాలు పెట్టారు. సంతోషాన్ని తెలియజేసారు.

ఆ రోడ్లు ఎలా వేయాలో కొండబాబు అందరికీ చూపించాడు.

ఆ రోడ్లు వేసేటప్పుడు కొందరి ఇళ్లు పడగొట్టవల్సి వస్తుందని తేలింది. అందులో గోవిందం టీ కొట్టూ, ఇల్లూ, అలాగే కొండబాబు పశువుల పాకా గూడా వున్నాయని తేలింది.

' ఈ రోడ్లు కొండబాబు ఎందుకు ఏయిస్తున్నాడు? నా టీ కొట్టూ - ఇల్లూ పడగొట్టి - నన్ను వూళ్లో నుంచి తరివీడానికే ఏయిస్తున్నాడు! అలా రోడ్లు ఒవుడూ ఎయినేడు! ఇళ్లు పడగొట్టే రోడ్లు మాకొద్దు! ఆ రోడ్లు పడవు! అలాంటి రోడ్లు ఎయినీం! ....' అని గోవిందం అన్నాడు. అలాగే మరి కొందరన్నారు.

* * *

'బాబూ తవరు పెద్దోరు! తవరి మాటకి నానెప్పుడు అడ్డు తవల్లేదు. తవరు నన్ను చ్ఛమించాలి! గోవిందం గోడికి కష్టం కలక్కుండా, ఆ రెండు రోడ్లు ఒగ్గేసి, మిగతా నాలుగు రోడ్లు ఎయిద్దాం! తవరు గోవిందాన్ని రచ్చించాలి!.... ఒక సుట్ట ముక్క ఇచ్చుగోండి! ....' అని నూకరాజు, కొండబాబు కాళ్లు పట్టుగున్నాడు.

' అలా జరగదు!....' అది వీలుపడదు!' అని కొండబాబు ఖచ్చితంగా చెప్పాడు.

' రోడ్లు అన్నీపడితే వూరు బాగుపడుద్ది! అందరికీ సుకం గుంటాది! వూరు తీరు-తెన్నుగా బావుంటాది! వూరందరి బాగు కోసం, ఒకిడికో – ఇద్దరికో కష్టం కలుగుద్ది! అది ఆళ్లు తట్టుకోవాలి! అన్ని రోడ్లూ పడితీరాలి! ఒవుళ్లూ ఆపనేరు!' అని చాలా మంది పట్టుపట్టారు.

అయితే, చివరికి-నూకరాజు, కొండబాబు కాళ్లు పట్టుకోడంవల్లో-మరెందుకో- ఆరోడ్లు పడలేదు.

* * *

కొంత కాలం గడిచింది.

గోవిందం మామ కన్ను మూసాడు. ఆ కుటుంబాన్ని చూడ్డానికి మగ దిక్కు ఎవ్వరూ లేరు. అంచాత గోవిందం-ఆవూరు వదిలి, అత్తవారి వూరికి వెళ్లిపోయాడు. వూరు వదిలి వెళ్లే ముందు-ఆ టీ కొట్టూ - ఇల్లూ ఎవ్వళ్లకీ అమ్మలేదు. అవి నేల మట్టం చేసి, రోడ్లు వేయించుకోమని చెప్పి, కాగితం రాసి ఇచ్చి, వెళ్లిపోయాడు.

* * *

కొంత కాలం గడిచింది.

ఆ వూళ్లో కాలేజీ వచ్చేసింది. కొండబాబు కొడుకు కూడా ఆ కాలేజీలో లెక్చరరుగా చేరాడు. అతడి ఆఖరి కొడుకూ-పెద్ద మనవడూ గూడా ఆ కాలేజీలో చదువుతున్నారు.

అయితే - ఆ వూళ్లో కొత్త రోడ్లు మాత్రం పడలేదు.

(తరుణ-మాసపత్రిక-జనవరి,1972)